నవలిక

# నీలి మేఘం

## నందం రామారావు

"ఇంకో పావుగంటలో సికింద్రాబాద్ స్టేషనొచ్చేస్తుంది." అని అనుకున్నాడు కిరీటి వాచీ చూసుకుంటూ.

ప్రక్కనున్న సూట్‌కేస్ తెరచి అందులోంచి టై, బ్లూకలర్ కోటూ పైకి తీశాడు. అద్దంలో చూసుకుంటూ తల దువ్వుకున్నాడు. టై కట్టుకుని కోటు వేసుకున్నాడు.

సిగరెట్ వెలిగించుకుని కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు కిరీటి.

అది ఫస్ట్‌క్లాస్ ఎ.సి. కూపే. దాన్లో కిరీటి ఒక్కడే వున్నాడు.

రైలు ఎలక్ట్రిక్ స్తంభాల్ని, గుట్టల్ని, ఇళ్ళనీ దాటుకుంటూ వేగంగా ముందుకు పరిగెడుతోంది.

రైలు సికింద్రాబాద్ సమీపిస్తున్నకొద్దీ అతని మనసు అదొకవిధమైన ఉద్వేగంతో నిండిపోయింది.

పదేళ్ళ క్రితం- మొదటిసారిగా తనీ వూళ్ళో అడుగుపెట్టాడు. ఆనాడు ఎంతో భయంగా, ఆశగా ఈ సిటీకి వచ్చాడు. అంతేకాదు, ఆనాడు ఈ నగరం తనకు నిజంగా భాగ్యదేవతలా కనిపించింది. ఆ చల్లని తల్లీఒడిలో హాయిగా పడుకుని సేద తీరాలనుకున్నాడు.

ఆనాడు తన మనసులో- ఎన్నెన్నో కలలు. మరెన్నో ఆశలు. కాని, చివరకు ఏమైంది?

ఆలోచిస్తున్న కిరీటి కళ్ళముందు ఆనాటి సంఘటన ఒకటి మెదిలింది.

అప్పటికి తను హైద్రాబాద్ వచ్చి వారం రోజులయింది. ఇక తను హైద్రాబాద్‌లో వుండడం అనవసరమని తేలిపోయింది. తన కలలన్నీ కల్లలు కాగా తీరని ఆశతో, అవమానంతో గుండెలు మండిపోతుండగా సికింద్రాబాద్ స్టేషన్ కొచ్చాడు. ప్లాట్‌ఫామ్‌మీద ఢిల్లీకి వెళ్ళే రైలు సిద్ధంగా వుంది. ఆ రైలెక్కి ఢిల్లీకి వెళ్ళాలనిపించింది. కాని, టిక్కెట్టు కొనడానికి డబ్బు లేదు!

పావలావుంటే బాగుండును. ఏ హోటల్‌లోనైనా 'టీ' తాగొచ్చునని ప్రొద్దుట నుంచీ తను ఎన్నోసార్లు అనుకున్నాడు. ఆ పావలాలేక, ఎవర్నీ అడుక్కోలేక 'టీ' తాగాలనే కోరికను అణుచుకున్నాడు.

మరి, ఇప్పుడు ఢిల్లీ వెళ్ళడానికి టిక్కెట్ ఎలా?

కిరీటి ఆలోచిస్తుండగానే రైలు కూతపెట్టి బయలుదేరడానికి సిద్ధమైంది. మరో ఆలోచనకు తావు లేకుండా దైవంమీద భారంవేసి వెంటనే రైలెక్కేశాడు కిరీటి.

ఆనాడు తన తీసుకున్న ఆ నిర్ణయమే తన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది.

"సికింద్రాబాద్ స్టేషన్" అన్న కేక వినిపించగానే కిరీటి వులిక్కిపడి లేచాడు.

సూట్‌కేస్ తీసుకుని బయటకురాగానే ఆటోలు, టాక్సీవాళ్ళు అతన్ని చుట్టుముట్టారు. కిరీటి వాళ్ళను తప్పించుకుని ఒక ప్రక్కగావున్న టాక్సీ దగ్గరకెళ్ళి నిలబడ్డాడు. ఆ టాక్సీ డ్రైవర్ పరుగునవచ్చి- "ఎక్కండి సాబ్" అంటూ డోర్ తీసి పట్టుకున్నాడు.

కిరీటి సీట్లో కూర్చుని- "హోటల్ సరోవర్" అన్నాడు. మరు నిమిషం టాక్సీ రోడ్డుమీద బాణంలా దూసుకుపోయింది.

** ** **

అది సరోవర్ హోటల్లోని ఎ.సి.డబుల్ రూమ్. కిరీటి అప్పుడే స్నానంచేసి, డ్రస్ చేసుకుని కూర్చున్నాడు. హోటల్ బోయ్ బ్రేక్‌ఫాస్ట్ తీసుకొచ్చాడు. టిఫిన్ తిని కాఫీ త్రాగాడు. సిగరెట్ వెలిగించి వాచీ చూసుకున్నాడు.

ఎనిమిది గంటల ఇరవై నిమిషాలయింది.

అప్పుడే తనీ వూరు వచ్చి గంట అవుతోంది. ఈ వూళ్ళో తనుండేది మూడు రోజులు మాత్రమే. ఈ మూడు రోజుల వ్యవధిలో తన పనులన్నీ పూర్తి చేసుకోవాలి.

పనులంటే... ...

స్నేహితులను కలుసుకోవడమే.

ఈ వూళ్ళో తనకున్నది ముగ్గురే స్నేహితులు.

శశాంక, ప్రభాకర్, సుధ...

తను వాళ్ళని కలుసుకోవాలి.

పదేళ్ళ క్రితం, నిరుద్యోగిగా, పూటకు గతిలేని దరిద్రుడిగా ఈ పట్నం వచ్చి వాళ్ళని సహాయం చెయ్యమని అడిగితే, తనని హేళనచేసి అవమానించారు.

ఈనాడు తను కోటీశ్వరుడు.

ఇప్పుడు ఈ విషయం తెలిస్తే వాళ్ళేమంటారో?

ఆశ్చర్యపడతారా? ఆనందపడతారా? లేక, అసూయపడతారా?

తనిది తెలుసుకోవాలి!

అందుకే తనిక్కడ కొచ్చాడు.

తను ముందుగా శశాంకను కలుసుకోవాలి.

శశాంకా, తనూ ఇంటర్ నుంచి డిగ్రీవరకూ క్లాస్‌మేట్స్. ఒక విధంగా స్నేహితులు కూడా.

చదువులో తనెప్పుడూ ఫస్టే. శశాంక తన నోట్స్‌లడిగి తీసుకునేవాడు. తెలియని పాఠాలు తనచేత చెప్పించుకునేవాడు. డిగ్రీ పరీక్షలు అయ్యాక తను వూరికి బయలుదేరాడు. అప్పుడు శశాంక తన దగ్గరకొచ్చి—

"కిరీటీ! నువ్వు సహాయం చెయ్యకపోతే నేనీ డిగ్రీ పరీక్షలు రాసేవాడిని కాదు. గజనీ మహమ్మదులా దండయాత్రలు చేస్తుండేవాడిని" అన్నాడు.

"వూరికే పొగిడెయ్యకు. నేను చేసిందేం లేదు."


"నువ్వెంత చేశావో నాకు తెలుసు. ఎప్పుడైనా హైద్రాబాద్ వస్తే మా ఇంటికి రా" అన్నాడు శశాంక.

"అలాగే" అని తను వచ్చేశాడు.

తండ్రి స్కూలు టీచరు. ఒకవైపుకు ఒరిగిపోయిన పెంకుటిల్లు, ఆకలికి ఏడ్చే పిల్లలు. ఊరినిండా అప్పులు. తనపై ఎన్నో ఆశలు పెట్టుకుని బ్రతుకుతున్న తల్లిదండ్రులు, చెల్లెళ్ళు, తమ్ముళ్ళు...

ఇవీ, తను ఇంటికి రాగానే కనబడ్డ దృశ్యాలు.

తను వెంటనే ఉద్యోగంలో చేరాలనుకున్నాడు. కాని, అది ఎంత ఎండమావో




నీలి మేఘం

తర్వాత అర్థమయింది.

తన తండ్రి ఆఫీసరు కాదు.

లక్షాధికారి అంతకంటే కాదు.

మామూలు ఎలిమెంటరీ స్కూలు టీచరు!

ఒకపూట తిని నాలుగు రోజులు పస్తులుండే అతి బీదవాడు.

తనకెలా ఉద్యోగం వస్తుంది?

డిగ్రీ పాసయి నాలుగేళ్ళయింది. ఈ నాలుగేళ్ళల్లో తను చేయని ప్రయత్నం లేదు. తనకిక ఉద్యోగం రాదనే నిర్ధారించుకున్నాడు. తనమీదనే ఆధారపడి, తను ఏ ఆఫీసరు ఉద్యోగమో చేస్తాడని, వాళ్ళ కష్టాల్ని తొలగిస్తాడని ఎదురుచూసే చెల్లెళ్ళు, తమ్ముళ్ళు.

తను వాళ్ళ ఆకలి తీర్చాలి. అంతేకాదు. తన చదువుమీద చేసిన అప్పు తీర్చాలి. ఎలా?

ఆ సమయంలో కిరీటికి శశాంక జ్ఞాపకం వచ్చాడు. అతనికి తనపై వున్న అభిమానం, చివరిరోజు అతడన్న మాటలు కూడా కిరీటికి గుర్తుకొచ్చాయి.

శశాంక తండ్రి పెద్ద పారిశ్రామికవేత్త. శశాంక కూడా డిగ్రీ పూర్తయ్యాక వ్యాపారంలోకి దిగాడు. ప్రస్తుతం తండ్రి బిజినెస్ వ్యవహారాలన్నీ అతనే చూస్తున్నాడు.

శశాంక గనుక తలచుకుంటే తనకు తప్పకుండా ఉద్యోగం దొరుకుతుంది.

అతను తన కంపెనీలోనే ఉద్యోగం ఇస్తాడు.

తండ్రితో చెప్పి హైదరాబాద్ రైలెక్కాడు కిరీటి.

** ** **

ఇంతలో, కాలింగ్ బెల్ మ్రోగడంతో కిరీటి ఆలోచనలకు బ్రేక్ పడింది.

తలుపు తీసుకుని హోటల్ బోయ్ లోపలికి వచ్చాడు. వచ్చి— "సార్! టాక్సీ వచ్చిందండీ" అన్నాడు వినయంగా.

"టాక్సీనా?" కిరీటి ఆశ్చర్యపోయాడు.

"అదేసార్! మీరు సరిగ్గా పది గంటలకల్లా టాక్సీ తెమ్మని చెప్పారు కదా?"

"ఓ. అవునుకదూ! నేను మర్చిపోయాను" అంటూ బోయ్‌ని అభినందించాడు.

కిరీటి కుర్చీలోంచి లేచి, డ్రెస్ సరిచేసుకున్నాడు. తలుపు లాక్‌చేసి, క్రిందికి వచ్చి, రిసెప్షన్‌లో తాళాలిచ్చాడు. బయటకు వచ్చి టాక్సీలో కూర్చున్నాడు.

టాక్సీ డ్రైవర్‌కి శశాంక ఆఫీసు అడ్రస్ చెప్పాడు. టాక్సీ కదిలింది.

కిరీటి విండోలోంచి బయటకు చూశాడు.

"పదేళ్ళకీ, ఇప్పటికీ చాలా మార్పు వచ్చింది" అనుకున్నాడు.

అవును. మార్పు ఎందుకురాదు.

మార్పు అనేది ప్రకృతి సహజ లక్షణం.

తనుమాత్రం మారలేదా?

ఆనాటికీ... ఇప్పటికీ తనలో ఎంత మార్పు?

కిరీటి మనస్సులో పదేళ్ళనాటి సంఘటన మెదలింది.

** ** **

ఆనాడు—

కిరీటి హైదరాబాద్‌లో ట్రైన్ దిగాడు. అతికష్టంమీద శశాంక ఆఫీసు కనుక్కున్నాడు.

అది రెండంతస్తుల భవనం.

ఆ భవనాన్ని చూసేసరికి కిరీటి కళ్ళు తిరిగిపోయాయి.

లోపలికి వెళ్ళాలంటే భయం వేసింది. గేటుదగ్గర చాలాసేపు తచ్చాడాడు. చివరికి ధైర్యంచేసి లోపలకు అడుగుపెట్టాడు. తలుపు దగ్గర టేబుల్‌మీద కూర్చున్న ప్యూన్ని అడిగాడు—

"శశాంక వున్నాడా?" అంటూ.

అతను, కిరీటిని పిచ్చివాడిలా చూసి మాట్లాడకుండా వూరుకున్నాడు.

కిరీటి మళ్ళా అడిగాడు.

"ఇంకా రాలేదు" తిరస్కారంగా కిరీటివేపు చూస్తూ అన్నాడు.

కిరీటి ప్రక్కనున్న బెంచీమీద కూర్చున్నాడు. నీరసంగా వుందతనికి.

నిన్న మధ్యాహ్నమెప్పుడో అమ్మ పెట్టిన చారునీళ్ళతో అన్నం తిని రైలెక్కాడు. ఇక, అప్పట్నుంచి కనీసం సోడాకూడా తాగలేదు. తండ్రి అప్పుచేసి ఇచ్చిన డబ్బు జాగ్రత్తగా వాడుకోవాలని అతని ఉద్దేశం. కాని, ఆకలి అతన్ని ఓడించింది. నిలవలేకపోయాడు.

"ఇక్కడ క్యాంటిన్ వుందా?" అని ప్యూన్‌ని అడిగాడు.

అతను ముఖం చిట్లించి— "అదిగో. ఆ చెట్టుదగ్గరుంది. పో" అన్నాడు.

కిరీటి నెమ్మదిగాలేచి క్యాంటిన్ దగ్గరకెళ్ళాడు. రెండు ఇడ్లీ తిని టీ త్రాగాడు. కాస్త ప్రాణం తెప్పరిల్లినట్లయింది. మళ్ళావచ్చి బెంచీమీద కూర్చున్నాడు.

నిమిషాలు గంటలుగా మారుతున్నాయి.

కాని, శశాంక జాడలేదు.

రాత్రంతా రైలులో నిద్ర లేకపోవడంవల్ల తలనొప్పి ప్రారంభమయింది. బెంచీమీద కూర్చోలేకపోతున్నాడు. తల తిరిగిపోతోంది. కళ్ళు మూతలు పడుతున్నాయి.

సరిగ్గా ఆ సమయంలో— గేటుదగ్గర కారుహారన్ వినిపించింది.

"అయ్యగారు వచ్చారు" అంటూ ప్యూన్ కంగారుపడ్డాడు.

కిరీటి ఎలాగోలేచి నిలబడ్డాడు.

తెల్లటి ఫియట్‌కారు గేటులోంచి లోపలకు వచ్చింది. ప్యూన్ గబగబా దగ్గరకెళ్ళి డోర్ తీసి పట్టుకున్నాడు. శశాంక ఠీవిగా కారులోనుంచి దిగాడు. చకచకా ముందుకు నడిచాడు.

కిరీటిని దాటుకుని లోపలకు వెళ్ళిపోయాడు.

శశాంక తనని చూశాడా? లేదా?— అనే అనుమానం కలిగింది కిరీటికి.

"చూసివుండడు. హడావుడిగా వెళ్ళాడుగదా!" అని సరిపెట్టుకున్నాడు.

ప్యూన్ మళ్ళీవచ్చి గుమ్మందగ్గర నిలబడ్డాడు.

"అయ్యగార్ని చూడాలి" అన్నాడు కిరీటి.

"నువ్వా?" అంటూ పైనుంచి కిందివరకూ కిరీటిని ఎగాదిగా చూశాడు.

"వెళ్ళడానికి వీల్లేదు. అయ్యగారు పనిలోవున్నారు" అన్నాడు.

కిరీటికి అతను పంపడని తెలిసిపోయింది అప్పటివరకు. ఎన్నో ఆఫీసులు

తిరిగివుండడంతో, ఆ ప్యూన్‌ని ఎలా లొంగదీసుకోవాలో కూడా అతనికి తెలుసు.

జేబులోంచి రూపాయితీసి, లక్ష రూపాయిలు ఇస్తున్నట్టుగా, ఎంతో బాధతో ప్యూన్‌చేతిలో పెట్టాడు. కాని, ఆ ప్యూన్ ముఖం వికసించలేదు.

కిరీటి బ్రతిమిలాడాడు. చివరకు అతికష్టంమీద కిరీటి అభ్యర్థనను అంగీకరించి లోపలకు పంపించాడు.

కిరీటి ఆనందంగా లోపలకు నడిచాడు.

అదొక పెద్ద హాలు.

ఆ హాలునిండా చీమల్లా మనుషులు. ఆ హాల్లో ఒక ప్రక్కగా పైకి వెళ్ళేందుకు మెట్లువున్నాయి. ఆ మెట్లదగ్గరువున్న కుర్రాడిని— "శశాంకగారు ఎక్కడున్నారు?" అనడిగాడు.

"మూడో అంతస్తులో వున్నారు"


ఆ కుర్రాడి సమాధానం విన్న కిరీటికి నీరసం ముంచుకొచ్చింది.

"లిఫ్ట్‌వుందా?" అని అడగబోయి, ఆ కుర్రాడికి కోపం వస్తుందేమోనని మానేశాడు.

ఒక్కొక్క మెట్టూ ఎక్కడం మొదలుపెట్టాడు కిరీటి. మూడు అంతస్తులూ ఎక్కేసరికి పంచప్రాణాల్లో నాలుగు ప్రాణాలు గాలిలో కలిసిపోయినట్లయ్యాయి!

శశాంక రూమ్ దగ్గరకెళ్ళాడు.

అక్కడ యమభటుడిలా మళ్ళా ప్యూన్ తయారయ్యాడు.



ప్యూన్ కిరీటిని చూశాడు.

చెమటతో కంపుకొడుతున్న బట్టలు, చెదరి నుదుటమీద పడుతున్న జుట్టు జిడ్డుపట్టిన ముఖం...

కిరీటి అవతారాన్ని చూసి ప్యూన్ అసహ్యంతో ముఖం తిప్పుకున్నాడు.

కిరీటి, అతన్ని కాళ్ళావేళ్ళాపడి, చేతిలో రెండు రూపాయిలు పెట్టాక, లోపలికి పంపించాడు.



ఒకే ఒక్కరు ప్రారంభిస్తారు
మిగతావారు అనుసరిస్తారు!

స్వీడిష్ పేపర్‌బాక్‌తో
ఫొటోటైప్ సెట్టింగులో
వెలువడిన తొలి తెలుగు నవల

యండమూరి వీరేంద్రనాథ్

మరణ మృదంగం

జూన్ విడుదల  రూ. 30/-

నవభారత్ బుక్ హౌస్, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2




**నీలి మేఘం**

లోపలకు అడుగుపెట్టగానే కిరీటి శరీరంలోని నరాలన్ని జివ్వున లాగినట్ల య్యాయి.

అది ఎ.సి.రూమ్. చక్కని సువాసన. ఖరీదైన కార్పెట్, కుర్చీలు, టేబుల్... ఆ టేబుల్ ముందు, అంతకంటే ఖరీదైన రివాల్వింగ్ ఛెయిర్లో శశాంక కూర్చుని వున్నాడు.

క్షణకాలం ఏదో భయం కలిగింది కిరీటికి.

శశాంకవేపు చూశాడు. అతను తలొంచుకుని ఏదో రాసుకుంటున్నాడు. శశాంకని పలుకరించలేకపోయాడు. అలాగే నిలబడ్డాడు కిరీటి.

నిమిషాలు గడుస్తున్నాయి.

ఎంతోసేపటికి శశాంక తలెత్తాడు.

ఎదురుగా నిలబడ్డ కిరీటిని చూసి ఆశ్చర్యపోతూ—

"నువ్వు..." గుర్తుపట్టనట్టుగా అడిగాడు.

"నేను కిరీటిని"

శశాంక ముఖం చిట్లిస్తూ కిరీటిని పైనుంచి కిందివరకు చూశాడు.

కిరీటి తనను తాను చూసుకుని సిగ్గుపడ్డాడు. కాని, తనేం చెయ్యగలడు?

శశాంక తనకి ఉద్యోగమిస్తే ఇంతకంటే ఎంతో శుభ్రంగా, ఎంతో ఉత్సాహంగా వుండగలడు.

"ఆ. ఏవిటీ?" శశాంక పొడిగా ప్రశ్నించాడు.

కిరీటికి బాధ కలిగింది. ఐనా, అవసరం తనది కనుక నోరు తెరచి అడిగాడు—

"శశాంకా! నాకు ఉద్యోగం లేదు. నువ్వేదైనా ఇప్పిస్తావని వచ్చాను."

"నేనా? నాకంత పలుకుబడిలేదు. మా కంపెనీలో కూడా ఏంలేవు"

శశాంక అలా పెడసరంగా మాట్లాడేసరికి ఇక అతనికి నోట మాట రాలేదు.

ఇతను శశాంకేనా? చదువుకునే రోజుల్లో తనంటే ఎంతో అభిమానంగా వుండేవాడు. ఎప్పుడూ తనని పొగుడుతూ వుండేవాడు. అవును. ఆనాడు తను శశాంకకంటే చాలా తెలివిగలవాడు. కాని, ఈనాడు శశాంక తనకంటే ఎన్నోరెట్లు ఉన్నత స్థానంలో వున్నాడు. తనకిప్పుడు అతని నీడను కూడా తాకే అర్హతలేదు.

"ఏం లేవని చెప్పానుగదా" శశాంక అన్నాడు.

అంటే తనని వెళ్ళమనేగా అర్థం. కాని, తను శశాంకమీద ఎన్నో ఆశలు పెట్టుకుని వచ్చాడు. అంతేకాదు, ఇంట్లో అందరితోను, తనకు శశాంక తప్పక ఉద్యోగమిస్తాడని చెప్పాడు. ఇప్పుడెలా తిరిగివెళ్ళడం! కిరీటి బాధపడసాగాడు.

శశాంక తిరిగి రాసుకోసాగాడు.

కిరీటి ఇక చేసేదిలేక వెనుదిరిగాడు.

'మనిషిచేత సృష్టింపబడ్డ ధనం, ఈనాడు ఆ మనిషినే కీలుబొమ్మని చేసి ఆడిస్తోంది. కాని, శశాంక కూడా ఆ ధనం చేతిలో కీలుబొమ్మలా మారతాడని, ఇంత క్రూరంగా, ఇంత నీచంగా ప్రవర్తిస్తాడని తనెప్పుడూ అనుకోలేదు. ఇదీ తన మంచికే జరిగింది. తనొక గుణపాఠం నేర్చుకున్నాడు.

మెట్లు దిగి, రోడ్డుమీదకొచ్చాడు కిరీటి.

** ** **

"సార్! ఇదేనండి మీరు చెప్పిన ఆఫీసు"

టాక్సీ డ్రైవర్ మాటతో కిరీటి వులిక్కిపడి ఆలోచన్ల నుంచి బయటపడ్డాడు. టాక్సీలోంచి దిగి, అతనికి డబ్బులిచ్చేశాడు. "వుండమంటారా సార్"

"వద్దు" అంటూ సిగార్ నోట్లో పెట్టుకుని వెలిగించుకున్నాడు కిరీటి. పొగ వదుల్తూ ఆ బిల్డింగ్ వేపు చూశాడు.

ఆ ఆఫీసు మరో అంతస్తు పెరిగింది. కొత్తగా గులాబీరంగు వేయించినట్లు న్నారు. ఉదయపు ఎండలో మెరుస్తోంది.

కిరీటి ముందుకు నడిచాడు.

గేటుదగ్గర గూర్ఖా కిరీటిని చూసి, లేచి నిలబడి సెల్యూట్ చేశాడు.

"ఇతడిదివరకు లేడు. శశాంక క్రొత్తగా నియమించినట్లున్నాడు" అని అనుకున్నాడు కిరీటి.

గేటుదాటి లోపలకొచ్చాడు.

ఆఫీసుముందు చక్కని తోట.

'ఆఫీసు ఇదివరకటికన్నా చాలా మారిపోయిందే' అనుకున్నాడు.

నెమ్మదిగా నడిచి, వరండా మెట్లెక్కి పైకి వచ్చాడు. అక్కడ ప్యూన్ కూర్చుని వున్నాడు.

కిరీటి అతనివేపు చూశాడు. అతను ఇదివరకటివాడే. కిరీటిని చూడగానే అతను కూడా లేచి నిలబడ్డాడు. అతను కిరీటిని గుర్తుపట్టినట్టు లేదు.

"శశాంక వున్నాడా?" ఠీవిగా అడిగాడు కిరీటి.

"వున్నార్ సార్" అన్నాడు వినయంగా.

"ఎక్కడా? పైన వున్నాడా?"

"అవున్ సార్!"

కిరీటి లోపలకెళ్ళాడు.

హాల్లోవున్న మనుషుల సంఖ్య ఇదివరకటికంటే పెరిగింది.

కిరీటి మెట్లదగ్గరకెళ్ళాడు. అక్కడున్న కుర్రాడు కిరీటికి సెల్యూట్‌చేసి- "సార్ పైకి వెళ్ళాలా?" అనడిగాడు.

"అవును"

"లిఫ్ట్ వుంది. రండిసార్" అంటూ కిరీటిని లిఫ్ట్ దగ్గరకు తీసుకెళ్ళాడు.

నిమిషంలో మూడో అంతస్తుకి చేరుకున్నారు.

"అటు వెళ్ళండి సార్. ఎదురుగా రూమ్ వుంటుంది"

కిరీటి ఆ కుర్రాడి చేతిలో అయిదు రూపాయిలనోటు వుంచాడు. ఆ కుర్రాడి ముఖం వెలిగిపోయింది. కిరీటికి వంగివంగి నమస్కారాలు చేశాడు.

కిరీటి శశాంక రూమ్‌వేపు నడిచాడు. రూమ్‌ముందు యథాప్రకారం ప్యూన్ స్టూలుమీద కూర్చున్నాడు.

అతను కూడా కిరీటిని చూడగానే లేచి నిలబడ్డాడు.

ఆ ప్యూను... ఇదివరికతనే! అతనిలో కాలం పెద్ద మార్పు తీసుకురాలేదు. అప్పటిలానే వున్నాడు.

అతన్ని చూస్తుంటే, ఆనాటి సంఘటన జ్ఞాపకం వచ్చి కిరీటికి అప్రయత్నంగా పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"సార్! ఎవరు కావాలిసార్? అయ్యగారా?" ఎంతో వినయంగా అడిగాడు వాడు.

అతని మర్యాద చూసి కిరీటి మనసులో నవ్వుకున్నాడు.

"సార్! లోపలికి వెడతారా?"

"అవును. శశాంక వున్నాడా?"

"ఆ వున్నారు సార్. వెళ్ళండి" తలుపుతీసి పట్టుకున్నాడు.

కిరీటి లోపలకు అడుగుపెట్టాడు.

చుట్టూ చూశాడు. అదే గది. అప్పటికన్నా ఎంతో ఖరీదుగా, మరెంతో ఆకర్షణీయంగా వుంది. ఎదురుగా శశాంక అప్పటిలానే తలొంచుకుని ఏదో రాసుకుంటున్నాడు. శశాంక ఆనాటికంటే కొద్దిగా లావయ్యాడు. తెల్లబడ్డాడు.

"హల్లో శశాంకా" గంభీరంగా అన్నాడు.

శశాంక తలెత్తి చూశాడు.

అప్పటికే కిరీటి కుర్చీలో కూర్చున్నాడు.

"మీరు..." సందేహంగా చూశాడు శశాంక.


కిరీటి నవ్వుతూ— "మీరు కాదురా. నువ్వు అను" అన్నాడు.

శశాంక తెల్లబోయి చూశాడు.

"నేనురా కిరీటిని"

"కిరీటా?" శశాంక కనుబొమలు ముడుచుకున్నాయి.

"ఇంకా గుర్తురాలేదా? అవును ఎలా గుర్తుంటుంది? మనం కలుసుకుని దాదాపు పదేళ్ళు దాటింది" అన్నాడు కిరీటి.




కిరీటి అనగానే శశాంక కళ్ళముందు మెదిలింది—

సన్నగా, పొడుగ్గా, చిరిగిన బట్టల్తో, జిడ్డోడుతున్న ముఖంతో దీనంగా వుండే రూపం...

కాని, తన ఎదురుగావున్న కిరీటి, అప్పుడే ఇంగ్లాండ్ నుంచి దిగి వచ్చిన రాజకుమారుడిలా వున్నాడు.

ఇతను కిరీటా?

గతానికీ, వర్తమానానికీ లంగరందక శశాంక కిరీటివేపు అయోమయంగా చూడసాగాడు.

"ఏవిటలా చూస్తున్నావ్ శశాంకా. నేను చాలా మారిపోయానా?"

అవును. అదే కంఠస్వరం. ఇతను కిరీటే. సందేహం లేదు. శశాంకలోని సంశయం తీరిపోయింది.

"నిజంగా చాలామారిపోయావు" అన్నాడు శశాంక.

"కాలం ఎంతటివాళ్ళనైనా మారుస్తుంది" అన్నాడు కిరీటి సిగార్ నోట్లో పెట్టుకుని పొగవదులుతూ.

శశాంక కిరీటి కోటుకున్న బంగారుగుండీలను చూస్తూ

"ఇప్పుడు ఏంచేస్తున్నావు" అనడిగాడు.

"బొంబేలో బిజినెస్ చేస్తున్నాను"

"ఏం బిజినెస్?"

"ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్"

"లాభాలు బాగావుంటాయా?"

"ఆ లక్షల్లో" కిరీటి చాలా నిర్లక్ష్యంగా చెప్పాడు.

ఆ మాట వినడంతోనే శశాంకకి గుండె ఝల్లుమన్నట్లయింది.

"శశాంకా! ఒక గ్లాసు మంచినీళ్ళిప్పిస్తావా?"

"సారీ, కిరీటి వుండు" అని బెల్ కొట్టి ప్యూన్‌ని పిలిచాడు.

"ఏం డ్రింక్ తీసుకుంటావు. గోల్డ్‌స్పాటా, లిమ్కా? ఏది కావాలి?"

కిరీటి నవ్వాడు- "అవేం వొద్దురా. ఒక గ్లాసు మంచినీళ్ళు చాలు" అన్నాడు.

"నో...నో... వాటరేమిటి? నాన్సెన్స్. రెండు మజా పట్టుకురా" అన్నాడు ప్యూన్‌వైపు తిరిగి శశాంక.

ప్యూన్ ఫ్రిజ్‌లో నుంచి రెండు మజాలు తీసి టేబుల్‌మీద పెట్టాడు. శశాంక ఒకటి కిరీటికిచ్చాడు.

కిరీటి ఒక్క గుక్క తాగాడు. గొంతులోకి చల్లగా దిగింది. చల్లటి ఆ మజా తాగుతుంటే ఎన్నో ఏళ్ళనాటి సంఘటన జ్ఞాపకం వచ్చింది కిరీటికి.

పదేళ్ళ క్రితం... ఆనాడు... ఆనాడు... మూడంతస్తుల మెట్లు ఎక్కి రావడంతో తనకు నోరు పిడచకట్టుకుపోయింది. విపరీతమైన దాహం వేసింది.

శ్రేష్ఠమైనవాటినే కొనేవారు
ఏరికోరి కొనేవి రాగి అడుగుతోగూడిన
కాళీ కాపర్ బాటమ్
స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు.




ఎందుకంటే కాళి ఒక్కటే సాటిలేని
అనేక అనుకూలతలు సమకూర్చేది

కాళి మార్కు 35 సంవత్సరాలకు పైగా స్టెయిన్‌లెస్ స్టీల్ వంట పాత్రల విశిష్టతకు ప్రసిద్ధికెక్కినది; అంతేకాదు, ఈనాడు, రాగి అడుగు గల వంట పాత్రలకు నం. 1 పేరు.

కాళి కాపర్‌బాటమ్ వంట పాత్రలలో ప్రత్యేక ప్రయోజనాలు.

* త్వరితమైన వంట:
వంటకు పట్టే సమయం 50% తగ్గుతుంది. కారణం, రాగి అన్ని లోహాలకంటే అత్యధిక ఉష్ణవాహక లోహం. (వెండికి మాత్రమే రెండవది.)

* తక్కువ ఇంధన వినియోగం:
తక్కువ మంటతోనే వంటంతా చెయ్యవచ్చు. సర్వత్ర సమానంగా వ్యాపించే వేడివల్ల మంట మచ్చలుగాని, వంటకాలు మాడిపోవడంగాని జరుగదు.

* మన్నికగల విలువ:
గుణగణాల దృష్ట్యా, స్టెయిన్‌లెస్ స్టీలు, రాగి, అణువుతో అణువుగా పరస్పర బంధితం కావడంవల్ల, ఆ రెండిటి మధ్యా విడదీయరాని బంధనం ఏర్పడుతోంది. అంతేగాక, రాగి బంధనం పాత్రయొక్క అట్టడుగు గోడలదాకా వ్యాపించి వుండడంవల్ల మంట, దాని వేడి, రెండూ వంటకు పూర్తిగా ఉపయోగపడుతుందనే హామీ లభిస్తోంది.

గృహిణుల విశ్రాంతికి ఎక్కువకాలం లభిస్తుంది. ఉద్యోగాలు చేసే స్త్రీలకు వంట త్వరగా పూర్తవుతుంది. ప్రతి ఒక్కరికీ–తక్కువ ఇంధనం ఖర్చు, బాగా వండిన వంటకాలు, దీర్ఘకాలపు విలువ.

kali ELECT — FOR BETTER COOKING AND ECONOMY

నకిలీల విషయంలో
జాగ్రత్త! కాళి ట్రేడ్‌మార్కు
వుందా లేదా చూడండి.

kali BRAND — FOR BETTER COOKING AND ECONOMY

విక్రయ ఏజెంటు:
శ్రీ విద్యా ఏజెన్సీస్, కుంభేశ్వరర్ సన్నిధి, కుంభకోణం 612 001
ప్రాంతీయ ఏజంట్లు:
సమ్ము & కో, పోస్ట్‌బాక్సు నం. 3622, ఎమ్‌జి రోడ్, ఎర్నాకులం, కొచ్చిన్ 682011, ఫోన్: 361139
ఈస్ట్ ఇండియా కంపెని, 3, అమృత బెనర్జీ రోడ్, (కాళీఘాట్ పోస్టాఫీస్ ఎదుట) కలకత్తా 700 026, ఫోన్: 471840
విక్టరీ మెటల్స్, 101, ఖేట్వాడీ మెయిన్ రోడ్, బొంబే 400 004 ఫోన్: 380075/354507
జె సి మూన్‌చందా, 15 ఎ/35, కరోల్ బాగ్, న్యూఢిల్లీ 110 005, ఫోన్: 562019

GK&E.M85.71 Tg.

## నీలి మేఘం

శశాంక మాటలు, అతని చిరాకు తనలోని దాహాన్ని ఇంకా ఎక్కువ చేశాయి. శశాంకని అడగడం ఇష్టం లేకపోయినా దాహాన్ని భరించలేక—

"శశాంకా! ఒక్క గ్లాసు మంచినీళ్ళిప్పిస్తావా? దాహంతో నోరెండుకుపోతోంది" అనడిగాడు.

"సారీరా నా దగ్గర డ్రింకులు తప్ప మంచినీళ్ళుండవు" అన్నాడు నవ్వుతూ.

ఆ నవ్వులోని హేళన తన గుండెల్ని చీల్చినట్లయింది. కిరీటి సిగ్గుతో తలెత్తుకోలేకపోయాడు.

"కిరీటీ! తాగరా. లేకపోతే పల్లదనం పోతుంది"

శశాంక మాటలకు ఈ లోకంలోకి వచ్చాడు కిరీటి.

'ఆనాడు నాకు గ్లాసుమంచినీళ్ళు ఇవ్వలేకపోయావ్. ఇప్పుడు కూల్‌డ్రింక్ ఇస్తున్నావ్. ఒరేయ్ శశాంకా! నువ్వు చేస్తున్న ఈ మర్యాదలన్నీ నాకు కాదురా. నా డబ్బుకి' అనుకున్నాడు కిరీటి.

"ఈ వూరు ఎప్పుడొచ్చావ్ కిరీటి?"

"ప్రొద్దున్నే. బిజినెస్ పనిమీద వచ్చాను" కిరీటి డ్రింక్ సీసా టేబుల్‌మీద పెడుతూ అన్నాడు.

ఫ్యాన్ పీసాలు తీసేశాడు.

"నేను వచ్చి నీ వర్క్ డిస్టర్బ్ చేసినట్లున్నాను"

ఆ మాటలకు శశాంక నొచ్చుకుంటూ—

"నో. నో. అదేంలేదు. ఐయామ్ వెరీ హాపీ. ఇన్నాళ్ళకు మళ్ళా స్నేహితుడిని చూడగలిగాను" అన్నాడు.

'స్నేహితుడు!' ఎంత చక్కగా మాట్లాడుతున్నావురా శశాంకా' కసిగా అనుకున్నాడు కిరీటి.

"ఎన్నాళ్ళుంటావ్?" శశాంక అడిగాడు.

"మూడు రోజులు"

"అంతేనా?"

కిరీటి చేతిమీది కోటు పైకి తీసుకుని టైమ్ చూసుకున్నాడు. వాచీకున్న గోల్డ్ డయిల్ తళుక్కుమంది. లక్ష రూపాయిలు ఖరీదుచేసే ఆ వాచీని చూడగానే శశాంకకి నోటమాట రాలేదు.

"శశాంకా. ఇక నేను వెడతారా" అంటూ లేచాడు కిరీటి.

"ఎక్కడికి?"

"సరోవర్‌లో దిగాను" పైపు నోట్లో పెట్టుకున్నాడు. చేతికున్న డైమండ్ వుంగరాలు తళతళలాడాయి. శశాంక వాటివైపు చూస్తూ...

"నేనుండగా హోటల్లో దిగావా? ఇంకానయంలే పద మా ఇంటికి వెడదాం" అంటూ లేచాడు.

అతని మర్యాదకి మళ్ళా నవ్వొచ్చింది కిరీటికి. నవ్వు ఆపుకుని- "వద్దులేరా" అన్నాడు.

"మాట్లాడకుండా పద" శశాంక, కిరీటి చెయ్యిపుచ్చుకుని బయటకు నడిచాడు.

ఇద్దరూ క్రిందికి వచ్చి కారులో కూర్చున్నారు. కారు బంజారాహిల్స్ వేపు దూసుకుపోయింది. పావుగంటలో రెండంతస్తుల మేడముందు నిలిచింది.

కిరీటి కారుదిగి మేడవేపు చూశాడు.

ఖరీదైన సినిమా సెట్టింగులావుంది.

ఆ మేడని చూస్తుంటే కిరీటి మనసులో మళ్ళా పదేళ్ళనాటి దృశ్యం ఒకటి మెదిలింది.

[ఇంకావుంది]